# జూదంలో సాహసం



పి. ఎస్. రామకృష్ణ

బొంబే ఎక్స్‌ప్రెస్ రంచన్‌గా ఎనిమిదింటికి సికింద్రాబాదు స్టేషన్‌నించి బయలుదేరింది. బండిలో అంతా తెగ రద్దీగా ఉంది. నాకు టూటయర్ కంపార్ట్‌మెంటులో బెర్తు దొరకబట్టికాని, లేకపోతే చాలా బాధపడిపోదును.

బహుశా ఇది ఆఖరుసారి కావచ్చు, ఇప్పట్లో బొంబాయి వెళ్లడం. లేకపోతే ప్రాజెక్టు అయిపోయే లోపల హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌వాళ్ళు ఖర్చులిచ్చి ఇంటర్వ్యూకు పిలిస్తే మధ్యలో వచ్చి వెళ్ళటం పడుతుంది.

హైదరాబాదు స్టేషనులో తెలుగు పత్రికలు నాలుగు కొన్నాను. ఫరవాలేదు. ఇవన్నీ చదివి పడుకుంటే బాగా తెల్లవారేదాకా నిద్రపోవచ్చు. మామూలుగా ఎప్పుడూ లేటుకాని బండి ఇవాళ కొద్దిగా లేటుగా నడుస్తున్నది. దోండ్‌కు వచ్చేటప్పటికి తొమ్మిదిన్నర దాటింది. అంటే దాదాపు గంట లేటన్నమాట. ఈ లెక్కన దాదర్ వెళ్ళేటప్పటికి మూడవుతుంది. కల్యాణ్‌లో దిగేటట్లయితే రెండు దాటుతుంది. నేనేమో కల్యాణ్, దాదర్‌ల మధ్య ఉన్న ఒక చిన్న స్టేషన్ విక్రోలి వెళ్ళాలి. ఈ ఎక్స్‌ప్రెస్ ట్రెయిను అక్కడ ఆగదు. కల్యాణ్‌లో దిగి ముందుకో, దాదర్‌లో దిగి వెనక్కో లోకల్ ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లో వెళ్ళాలి. కల్యాణ్‌లో దిగటమా, దాదర్‌లో దిగటమా అని

ఆలోచిస్తున్నాను. కల్యాణ్‌లో దిగితే కొద్దిగా టైము కలిసివస్తుంది. అదీ నమ్మకంలేదు. కల్యాణ్ వచ్చే లోకల్ ట్రెయిన్ల సంఖ్య చాలా కొద్ది. అదృష్టం బాగుండకపోతే అరగంటపైగా అక్కడే గడపవలసి వస్తుంది. అయినా ఈ ఎండలో ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లాలనిపించటంలేదు. దాదర్‌లోదిగి క్లోక్‌రూములో సామాను పడేసి, పార్సీ కాలనీలో మా బంధువులింటికి వెళ్లి మెల్లిగా సాయంత్రం హాస్టలుకు వెళతాను.

రైలు దాదర్‌లో ఆగింది. సూట్‌కేసు, హోల్డాలు సర్ది తాళం వేశాను. జేబులో డబ్బు చూసుకుంటే నాలుగురూపాయలుంది. ఎందుకైనా మంచిదని సూట్‌కేసులోనించి ఇంకో పదిరూపాయలు తీసి జేబులో వేసుకుని, సూట్‌కేసు తాళంవేసి దిగాను. మేడమీదికి వెళ్లి క్లోక్‌రూములో అవి పడేశాను.

మళ్లీ ఇంకో ఆలోచన వచ్చింది, ఇప్పుడు పార్సీ కాలనీకి వెళ్లటమావద్దా అని. ఇంట్లో ఎవళ్లైనా ఉంటారో ఉండరో? పిల్లలంతా ఆఫీసులకు వెళ్లేవాళ్లే. ఆవిడ వరసకు అత్తయ్య అవుతుంది. సాధారణంగా ఇంటిదగ్గిరే ఎవరితోనో కబుర్లు చెప్పటానికి వెళ్తుంది. అదిగాక ఇదివరకెప్పుడూ ఇట్లా ఇటువంటి పరిస్థితిలో వెళ్లలేదు. అంటే మొట్టమొదటిసారి అన్నమాట. వసన్‌వాడికి వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్లివస్తే? చాలా రోజులయింది వెళ్లి. ఇప్పుడు వెళితే సరిపోతుంది. మళ్లీ తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రం అవుతుంది. అప్పుడు మావాళ్లింటికి వెళ్లవచ్చు.

సరేనని దాదర్ వెస్ట్‌వైపు నడక మళ్లించాను. సెంట్రల్‌రైల్వేకు, వెస్టర్న్‌రైల్వేకుదాదర్‌లో స్టేషన్లు ఉన్నాయి. రెండూ పక్క పక్కనే ఉంటాయి. రెండింటినీ కలిపే బ్రిడ్జీలు రెండున్నాయి. బ్రిడ్జీమీద మామూలుగానే అన్నిరకాల అమ్మకాలూ జరుగుతున్నాయి. వాటిని దాటుకుంటూపోతూ ఒకచోట చటుక్కున ఆగాను. ఎవడో మూడుముక్కలతో జూదం ఆడిస్తున్నాడు. డైమను రెండూ, అరకు రెండూ, ఇస్పేటాసూను. మూడుముక్కలూ మహా ఒడుపుగా అటూ ఇటూ మారుస్తున్నాడు. అవి బోర్లించి పెడతాడు. మనం ఏ ముక్కమీదన్నా డబ్బు కడితే, అది ఇస్పేటాసయితే మనం ఎంత కట్టామో అంత వాడు తిరిగి ఇస్తాడు. లేకపోతే మన డబ్బు పోతుంది. నలుగురు నిలుచుని ఆడుతున్నారు. చూస్తూ నిలబడ్డాను. ఇద్దరు ముగ్గురు డబ్బు కట్టుతూ, ఓడిపోతున్నారు. నాలుగోవాడు ఇస్పేటాసు ముక్క పైకి తీసి దాని అంచు కొద్దిగా నలిపాడు. దానికి జూదగాడు తప్పకుండా అభ్యంతర పెడతాడనుకున్నాను. కాని వా డది గమనించినట్లే లేదు. రెండుముక్కలమధ్య ఆసు పెట్టి ఒడుపుగా విసిరాడు. ఆసు ఎక్కడ పడ్డదో నాకు తెలుస్తూనే ఉంది. చూస్తున్నవాళ్లలో ఒకడు రెండు రూపాయలు కట్టాడు, రెండుమీద. ఏముంది! పోయింది. మళ్లీ ముక్కల్ని విసిరాడు. ఈమాటు ఇంకోడు ఆసుమీద రూపాయి కట్టి గెలుచుకున్నాడు.

ఆట జోరుగా సాగుతూంది. ముక్క నలిపినవాడు ఆడుతున్నవాడు ముక్కల్ని విసిరివెయ్యగానే, ఆసు ఎక్కడ ఉందో వేలితో చూపెడుతూనేఉన్నాడు, మిగతా వాళ్లకు. నాకూ తెలుస్తూనేఉంది. అయినా చాలా మాట్లు ఆడుతున్న వాళ్లు ముగ్గురూ రెండుమీదే పందెం కట్టి ఓడిపోతున్నారు. అడపాదడపా ఆసుమీద కట్టి గెలుస్తున్నారు. నాలో ఆశ పుట్టుకు వచ్చింది. తెలివిగా పందెంకట్టి తేలికగా డబ్బు పోగేసుకుందామని జేబులోంచి పదిరూపాయల నోటు తీశాను. నాలుగైదు సార్లు వరసగా ఆసు ఎక్కడ పడుతూందో చూసుకుని అయిదోసారి పందెం కట్టాను, పదిరూపాయలూ. వాడు నవ్వుతూ ముక్క తిప్పి చూపించాడు. డైమను రెండు!

కళ్లు తిరిగినట్లయింది! పక్కనున్న ముక్క నలిపిన వాడు "అరే! దానిమీద ఎందుకు కటావు! ఈమాటు నేను చూపిస్తాను చూడు. వాడగ్గిర డబ్బు లేదుకాని లేకపోతే వీణ్ణి దివాలా తీయించేవాణ్ణి!" అన్నాడు. నాకు నామీదే చాలా కోపం వచ్చింది, 'ఎట్లా మోసపోయానా?' అని. ఇంకా జేబులో నాలుగురూపాయలున్నాయి. రెండురూపాయలు తీసి మళ్లీ కట్టాను. పోయింది. మళ్లీ ఇంకో రూపాయి తీసి కట్టాను. గెలిచాను. మళ్లీ రెండు రూపాయలు కట్టాను. మళ్లీ గెలిచాను. ఆ నాలుగురూపాయలూ మళ్లా కట్టాను. డైమను రెండు వచ్చింది! జేబులో ఇంకా ఒక రూపాయి ఉంది. వాడు రూపాయకంటే తక్కువ కట్టనివ్వడు. చాలాసేపు ఆ రూపాయ కట్టటమా వద్దా అని ఆలోచించాను. చివరికి ధైర్యంచేసి కట్టాను. పోయింది. ఇంక జేబులో డబ్బుల్లేవు. లేదని తెలిసికూడా మళ్లీ వెతికాను. పేంటు జేబులో ఎనిమిది నయాపైసలు ఉన్నాయి. హిప్‌పాకెట్‌లో ఏదో కాగితం రెపరెపలాడుతూంది. తీస్తే క్లోక్‌రూమ్‌లో ఇచ్చిన రసీదు. ఇప్పుడు వసన్‌వాడికి వెళ్లటానికికాదు కదా ప్లాట్‌ఫారమ్ టికెట్టు కొనడానికికూడా డబ్బులు లేవు. క్లోక్‌రూమ్‌లో సూట్‌కేసులో డబ్బుందికాని, ఇప్పుడు అది బయటికి తీస్తే మళ్లీ వాడు తీసుకుంటాడో లేదో. క్లోక్‌రూమ్‌లో ఉంచి అరగంటకూడా కాలేదు. వసన్‌వాడికి వెళ్లేదెలాగూ లేదు, అని దాదర్‌లో సెంట్రల్‌స్టేషన్ బయటికి వచ్చాను. ఆ పరిస్థితిలో పార్సీ కాలనీలో బంధువులింటికి వెళ్ల బుద్ధికాలేదు. వెళ్లినా ఎవరైనా ఉంటారో ఉండరో?

మాటుంగావైపు నడక సాగించాను. దోవలో ఆంధ్ర మహాసభపక్క పార్కు ఆహ్వానించింది. కాసేపు పడుకుంటే హాయిగా ఉంటుందనిపించింది. నీడన ఉన్న బెంచీలన్నింటిమీద పడుకునిఉన్నారు. మళ్లీ వచ్చేటప్పుడు చూద్దాంలే అనుకుని మాటుంగా స్టేషన్‌కు వెళ్లాను. తెలుగు పత్రికలు కొత్తవి ఏవీ లేవు. ఉన్నా నా దగ్గిర కొనటానికి డబ్బుల్లేవన్నది వేరే విషయం. వెనక్కి తిరిగి పార్కుకు వచ్చాను. ఓ చెట్టు నీడచూసి, ఒంటిన ఉన్నవి టెరికిన్ బట్టలే కాబట్టి పడుకున్నాను.

జరిగిన అవమానంతో కడుపు దహించుకుపోతున్నది. ఆకలికూడా వేస్తున్నది. చాలా దగ్గిర్లో ఉడిపి హోటలుంది. కాని ఏం లాభం! వెళ్లి కడుపునిండా తిని మర్యాదగా "డబ్బుల్లేవు. అడ్రస్ ఇస్తాను. రేపు వచ్చి డబ్బు లిస్తాను" అని చెబితే! వాడికా వరస నచ్చకపోతే నగుబాటవుతుంది. బఠాణీలవాళ్లు కూడా పది పైసలకు తక్కువకు రారు.

అల్లంత దూరంలో మడత పెట్టిన ఓ కాగితం కనపడ్డది. చూట్టానికి వందరూపాయల నోటల్లేఉంది. ఇదివరకు చాలాసార్లు అనుకున్నాను, 'వందరూపాయల నోట్లు నాకు రోడ్డుమీద ఎందుకు దొరకకూడదు!' అని. ఇప్పు డలాంటిది జరుగుతున్నదేమో? దగ్గిరికి వెళ్లి చూశాను. నా కళ్లు నేనే నమ్మలేకపోయినాను. నిజంగా వందరూపాయల నోటే! మడత తీసి చూస్తే లోపల ఓ పదిరూపాయల నోటూ, నాలుగు రూపాయ కాగితాలూ ఉన్నాయి. అన్నీ పాతనోట్లే. దొంగనోట్లయితే కొత్తగా ఉంటాయని విన్నాను. అంతతో నా ఆలోచన వేరొకవైపు పోయింది. ఇప్పుడు వెళ్లి ధైర్యంచేసి ఈ వందరూపాయల నోటు పందెం కడితే! వస్తే ఇంకో వంద వస్తాయి. పోతే ఇదీ పోతుంది. ఇది పోయినా, పద్నాలుగు రూపాయల సొమ్ము—నేను ఇందాక పోగొట్టుకున్న సొమ్ము—నాకు మిగులుతుంది. కాని వందరూపాయలు పోతాయేమోనన్న భయం పీకుతూనేఉంది. అయినా అంతకంటే ఎక్కువగా ఆ జూదగాణ్ణి ఓడించాలన్న పట్టుదలకూడా ఉంది. మళ్లీ ఆలస్యం చేస్తే వా డక్కడినించి వెళతాడేమో! గబగబా వెళ్లాను. వా డింకా అక్కడే ఉన్నాడు.

ఎందుకైనా మంచిదని నాలుగుసార్లు మళ్లీ చూశాను. నాలుగుసార్లూ ఆసు నేను పసికట్టకలిగాను. అయిదోసారి ధైర్యంగా వందనోటు కట్టాను. వాడు బితుకుబితుకుమంటూ ముక్క తిరగేశాడు. ఆసే! 'జరిగిందిరా నీకు శాస్తి!' అనుకున్నాను. వాడి చేతిలో చిత్తుగా ఉన్నాయి రూపాయినోట్లు. తీసి లెక్క పెట్టాడు. యాభై రెండు రూపాయనోట్లూ, మూడు పదిదులూ, అయిదునోటూ ఉన్నాయి. మొత్తం ఎనభై ఏడు. ఇంకా జేబులో ఉన్నాయి తియ్యమన్నాను. వాడిదగ్గిర లేవు. "రేపు ఈ టైముకు రండి మిగతాది ఇస్తాను" అన్నాడు వాడు. 'ఏడిశావు లేవోయ్!' అనుకుని, వాడు ఇచ్చిన ఎనభై ఏడూ పుచ్చుకుని బయటపడ్డాను. కాళ్లు నేలమీద ఆనటం లేదు. తేలిపోతున్నాయి. సర్కిల్లో జ్యోతికి వెళ్లి కడుపు నిండా తిందామని నిశ్చయించుకున్నాను. హఠాత్తుగా పెద్ద వాల్యూముతో ఎక్కడినుంచో పాట వినపడ్డది.

కళ్లు నులుముకుంటూ లేచాను. మహాసభ ఆవరణలో ఏదో మలయాళీ సంఘం ఉత్సవాలు జరుగుతున్నాయి. వాళ్లు హిందీ పాటలు వేస్తున్నారు. నన్ను మేల్కొలిపింది వాళ్ల పాట. కమ్మని కల ధ్వంసమైపోయింది. 'జ్యోతిలో టిఫిన్ చేసిన తరవాత మెలుకువ రాకూడదూ!' అనుకున్నాను.

తరవాత జరిగింది చాలా కొద్ది. అవాళ సాయంత్రం వల్లబడేదాకా పార్కులోనే ఉండి క్లోక్‌రూమ్‌కు వెళ్లి సామాను విడిపించి, సూట్‌కేసులోంచి డబ్బు తీసుకున్నాను. మళ్లీ సామాను రూమ్‌లో పడెయ్యవచ్చా అంటే ఏకళ నున్నాడో ఒప్పుకున్నాడు. దాదర్‌లో మావాళ్లింటికి వెళ్లాను. ఆరోజు వాళ్లు సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. స్పేర్‌గా ఓ టికెట్టుందని రమ్మన్నారు. వెళ్లాను. నాకు ఇష్టమైన నటుడు ఉన్న సినిమా కాబట్టి మధ్యాహ్నం జరిగిందంతా మరిచిపోయాను. ఇంటర్వెల్‌లో మాకు కొద్దిగా ముందు కూచుని కొద్దిగా గోల చేస్తున్న నలుగురి మొహాలు చూడటం తటస్థించింది. జూదగాడూ, ముక్క నలిపినవాడూ, మిగతా అక్కడ ఆడుతున్న ఇద్దరూను. అంతా లోపలదొంగలు.

ఆ తరవాత ఎప్పుడూ దాదర్ సెంట్రల్‌నుంచి వెస్ట్‌వైపు మారేటప్పుడు ఆ బ్రిడ్జిమీదినించి వెళ్లలేదు. రెండో బ్రిడ్జిమీదనించే వస్తూ పోతూ వచ్చాను. నిజాని కదే బాగుంటుంది. ★